పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

మల్కాజిగిరి: వసంతపురి కాలనీలో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ సూచించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కొన్ని కాలనీల్లో యూజీడీ నిర్మాణాలు అసంపూర్తిగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, యూజీడీ పనులు ప్రారంభించడంలో సమస్య పరిష్కారమవుతుందన్నారు. జలమండలి మేనేజర్ నవీన్, సత్యమూర్తి, కిషోర్, యాదగిరి, సూర్యనారాయణ, వెంకటస్వామి, సోమయ్య, శ్రీనివాస్, సౌమ్య, శోభారాణి, సుజాత, వనిత, ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయించండి

గౌతంనగర్: అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ సునీతారాము యాదవ్ జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తికి సోమవారం వినతిపత్రం అందజేశారు. డివిజన్ పరిధిలోని ఉత్తమ్‌నగర్, మల్లిఖార్జుననగర్ తదితర కాలనీల సమస్యలు పరిష్కరించాలని కోరారు. దీనికి కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.

అభివృద్ధికి సంపూర్ణ సహకారం



కుషాయిగూడ: మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్, కృష్ణానగర్ కాలనీ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు సోమవారం కార్పొరేటర్ ప్రభుదాస్‌తో కలిసి ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని అభినందించారు. ఐక్యంగా ఉండి కాలనీని అభివృద్ధి చేసుకోవాలన్నారు. సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలన్నారు. కాలనీ అధ్యక్షుడు మల్లారెడ్డి, ఎంఎస్ఎన్.మూర్తి, రాజయ్య, జయమ్మ, దేవరాజు, అంజయ్య, బాలరాజుగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, శ్యామ్‌సుందర్, కృష్ణవేణి తదితరులున్నారు.

గణితంలో ఘనాపాటి రామానుజన్

రామంతాపూర్: బాలభారతి స్కూల్‌లో నిర్వహించిన గణిత పితామహుడు శ్రీనివాసరామానుజన్ జయంతి ఉత్సవంలో భాగంగా విద్యార్థులు రూపొందించిన పలు గణిత నమూనాలను స్కూల్ సెక్రటరీ సత్తిరాజు కపర్తిశ్వర్‌రావు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గణితంలో ఘనాపాటి అయిన శ్రీనివాస రామానుజన్ భారతీయుడు కావడం మనందరికీ గర్వకారణమన్నారు. అప్పట్లో పరిష్కారం కాని సమస్యలను కూడా పరిష్కరించిన గొప్ప మేధావి అని కొనియాడారు. విద్యార్థులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. హెచ్‌ఎం. నాగమణి, నాగలక్ష్మి, సరిత, సరస్వతి, బేబి పాల్గొన్నారు.

తాను చనిపోతూ.. ఇతరుల జీవితాల్లో వెలుగులు

ఉప్పల్: తాను చనిపోతూ మరికొంతమంది జీవితాల్లో వెలుగులు నింపాడు ఓ యువకుడు. ఉప్పల్ భరత్‌నగర్ ప్రాంతానికి చెందిన గుమిడెల్లి వసంత్(20) అనారోగ్యంతో ఎల్‌బీనగర్ కామినేని ఆసుపత్రిలో చేరగా.. ఈనెల 21న బ్రెయిన్ డెడ్ అయినట్లు డాక్టర్లు ప్రకటించారు. దీంతో మృతుడి తండ్రి రఘు, తల్లి సుజాతలతో సంప్రదించిన డాక్టర్లు ఎట్టకేలకు వసంత్ అవయవాలను దానం చేసేందుకు అంగీకరించారు. డిగ్రీ చదువుతున్న వసంత్ అకస్మాత్తుగా మృతి చెందడంతో భరత్‌నగర్‌లో విశాదఛాయలు అలుముకున్నాయి.

గుర్తు తెలియని వాహనం ఢీ..

దివ్యాంగుడికి గాయాలు

కుషాయిగూడ: రోడ్డు దాటుతున్న ఓ దివ్యాంగుడిని గుర్తు తెలియని బైక్ ఢీకొట్టిన ఘటన సోమవారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి సమయంలో ఈసీఐఎల్ చౌరస్తాలో రోడ్డు దాటుకుంటూ.. కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ వైపు వస్తున్న దివ్యాంగుడిని బైక్ అదుపు తప్పి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడు అపాస్మరకస్థితిలోకి వెళ్లాడు. విషయం తెలుసుకున్న పోలీసులు క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కాగా అతడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

హక్కుల అవగాహనతో మోసాలకు చెక్

ఉప్పల్: వినియోగదారులు హక్కుల అవగాహనతోనే మోసాలకు చెక్ పెట్టవచ్చని ప్రభుత్వ సిటీ కళాశాల కామర్స్ లెక్చరర్ డా.ఎస్ జాన్సీ సూచించారు. జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.విజయ్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆన్‌లైన్ వ్యాపారం విస్తృతమవ్వడంతో అదేస్థాయిలో మోసాలు కూడా పెరుగుతున్నాయని, ఆందోళన వ్యక్తం చేశారు. వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

బస్సు వేళలెప్పుడో ?

• సమయానికి రాదు, సమాచారం ఉండదు • అప్‌డేట్ కాని టీజీఎస్ ఆర్టీసీ గమ్యం యాప్ • ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు



ప్రయాణికుల సమాచార కేంద్రం



ఈసీఐఎల్ బస్ టెర్మినల్‌లో బస్సుకోసం ఎదురు చూపులు

కాప్రా: నూతన ఒరవడితో ముందుకెళ్తున్న టీజీఎస్ ఆర్టీసీ ప్రజలకు చేరువవుతూ ప్రయాణికుల మన్ననలు పొందుతోంది. కానీ కుషాయిగూడ డిపోకు చెందిన పలువురు సిబ్బందిపై మాత్రం ప్రయాణికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కుషాయిగూడ డిపో ఆధ్వర్యంలో నడుస్తున్న పలు ఆర్టీసీ బస్సు వేళలపై ప్రయాణికులకు సమాచారం ఉండటంలేదు.

నమోదు కాని బస్సుల వివరాలు..

డిజిటల్ సేవలతో ప్రయాణికులకు దగ్గరైన టీజీఎస్ఆర్టీసీ 'గమ్యం' పేరుతో యాప్ ద్వారా ప్రయాణికులు వెళ్లాల్సిన బస్సును ట్రాక్ చేసుకునే అవకాశం కల్పించారు. ఈ యాప్‌లో కుషాయిగూడ డిపోకు చెందిన ఈసీఐఎల్ నుంచి వివిధ జిల్లాలు, గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే బస్సుల వివరాలు మాత్రం అప్‌డేట్ కావడం లేదు. దీంతో ప్రయాణికులు వారు వెళ్లాల్సిన గమ్య స్థానాల బస్సులను ట్రాక్ చేసి తెలుసుకోలేకపోతున్నారు.

◆ ప్రయాణికులు ఎక్కాల్సిన బస్సు ఎక్కడి వరకు వచ్చిందని, యాప్ ద్వారా ట్రాక్ చేస్తే ఎలాంటి అప్‌డేట్ ఉండటం లేదని ఈసీఐఎల్ బస్ టెర్మినల్ నుంచి ప్రయాణించే ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కుషాయిగూడ బస్ డిపో

వివరాలు అడిగితే అసహనం..

◆ యాప్ ద్వారా బస్సుల వివరాలు తెలియకపోవడంతో ఈసీఐఎల్ బస్ టెర్మినల్ నుంచి ప్రయాణించే చాలా మంది ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్సు ఎక్కడుంది, ఎప్పుడు వస్తుందని..? ప్రశ్నిస్తే బస్ టెర్మినల్‌లో ఆర్టీసీ ఏర్పాటు చేసిన ప్రయాణికుల సమాచార కేంద్రంలో అడిగితే అక్కడ విధులు నిర్వహిస్తూ.. వివరాలు చెప్పాల్సిన సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని వాపోయారు.

ఆగ్రహిస్తే వివరాలెలా.. ?

◆ గమ్యస్థానాలకు వెళ్లాల్సిన బస్సు వివరాల కోసం మహిళలు, యువతులు, వృద్ధులు ఈసీఐఎల్ బస్ టెర్మినల్‌లోని టేబుల్ వేసుకుని కూర్చున్న ఆర్టీసీ సిబ్బంది వద్దకు వెళ్లి అడుగుతున్నారు. అయితే వారు ఓపికతో వివరాలు అందించాల్సింది పోయి ప్రయాణికులపైనే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని, ప్రయాణికులు వాపోతున్నారు.

పర్యవేక్షణ లోపమా..

◆ ఆర్టీసీ సిబ్బంది ప్రయాణికులకు ఎప్పటికప్పుడు సమాచారం సక్రమంగా అందిస్తున్నారా.. లేదా అని డిపో స్థాయి ఉన్నతాధికారి పర్యవేక్షణ ఉందా.. అని ప్రయాణికులు ప్రశ్నించుకుంటున్నారు. సిబ్బంది పనితీరు,ప్రయాణికుల సమస్యలపై ఎప్పటికప్పుడు తెలుసుకునేలా డిపో స్థాయి ఉన్నతాధికారి లేకపోవడంతోనే తాము ఇలాంటి సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రయాణికులు చర్చించుకుంటున్నారు. సమస్యలు తలెత్తకుండా ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఉప్పల్: ఉప్పల్ భగాయత్ 11 కేవీ సరస్వతినగర్ ఫీడర్ పరిధిలో నేడు ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు సరస్వతి నగర్, ఆర్టీఏ కార్యాలయం, ఎస్‌వీఎం హోటల్ లేన్, నాగోల్ మెట్రోస్టేషన్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

◆ 11కేవీ శిల్పారామం ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 1.30 నుంచి 2గంటల వరకు శిల్పారామం, డిమార్ట్ లేన్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

బోడుప్పల్: వివేకానందనగర్ కాలనీ ఫీడర్ పరిధిలో మంగళవారం విద్యుత్ మరమ్మతుల కారణంగా ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ వేణుగోపాల్ ఓ ప్రకటనలో తెలిపారు. మణికంఠనగర్, వివేకానందనగర్, శ్రీలక్ష్మీనగర్, లెక్చరర్స్ కాలనీ, ఎస్‌బీఎన్ కాలనీ, ఐఐసిటీకాలనీ, భీమ్‌రెడ్డినగర్, అశోక్‌నగర్, గ్రీన్‌సిటీకాలనీ, అన్నపూర్ణ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మల్లాపూర్: 33/11 కేవీ మల్లాపూర్ నోమా సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా మంగళవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు మల్లాపూర్ విద్యుత్ ఏఈ నాగరాజు పేర్కొన్నారు. నర్సింహానగర్ ఫీడర్ పరిధిలోని శివహోటల్, అన్నపూర్ణకాలనీ, నర్సింహానగర్, ఎన్టీఆర్‌నగర్, శాంతినగర్, మీర్‌పేట్, సాయిగార్డెన్ ఏరియాలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు.

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంట వరకు 11కేవీ ఎస్‌ఎండీసీ ఫీడర్ పరిధిలోని కళ్యాణ్‌నగర్, ఎస్ఎండీసీ కాలనీ, ఈస్ట్ ఆనంద్‌బాగ్,బ్యాంక్ కాలనీ, తాళ్లబస్తీ ప్రాంతాల్లో, 11 కేవీ అనంత సరస్వతీనగర్ ఫీడర్ పరిధిలో షిరిడీనగర్, ఆదర్శ్‌నగర్ ప్రాంతాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 11కేవీ ఈస్ట్ చంద్రగిరి కాలనీ ఫీడర్ పరిధిలోని లాల్‌వాణీనగర్, చంద్రగిరి కాలనీ, వినాయక నగర్ ప్రాంతాల్లో అదే సమయంలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శ్రీనివాస్ తెలిపారు.

◆ వినాయకనగర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా 11 కేవీ శారదానగర్, ట్యాంక్‌బండ్, దీనీనగర్, డైట్, ఓల్డ్ సఫిల్‌గూడ, ఆర్‌కేనగర్, సంతోషిమానగర్ ఫీడర్ల పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సంబంధిత ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ సుమన్ క్రిస్టినా తెలిపారు.

అల్వాల్: 33/11 కేవీ సబ్‌స్టేషన్ వాజ్‌పేయినగర్ నేరేడ్‌మెట్ సెక్షన్ విద్యుత్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా మంగళవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆఫీసర్స్ కాలనీ, బృందావన్ కాలనీ, వివేకానందపురం, దీనదయాళ్‌నగర్, కెకె.నగర్, మధురానగర్, ఆర్‌కేపురం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ ఏఈ లత ప్రకటించారు.

మేడిపల్లి: 11కేవీ ధరణి ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలను తొలగిస్తున్న కారణంగా 33/11 కేవీ పీఅండ్‌టీ కాలనీ ఫీడర్ పరిధిలో మంగళవారం మధ్యాహ్నం 12.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు సాయిహిల్స్ కాలనీ, పీఅండ్‌టీ కాలనీ, శ్రీనివాస నగర్, వినాయకనగర్, సంపూర్ణ కాలనీ మేయిన్ రోడ్డు, సాయిరాంనగర్ కాలనీ, క్రాంతికాలనీ, గ్రీన్ ల్యాండ్స్ కాలనీ, పంచవటీ కాలనీ రోడ్డు నెంబర్ 1,2,3, విహారిక కాలనీ రోడ్డు నెంబర్1,2,3,4,5, కాకతీయనగర్ కాలనీ, ధరణి కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ ప్రదీప్‌కుమార్ తెలిపారు.

◆ 11 కేవీ కెనరానగర్ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలను తొలగిస్తున్నందున 33/11 కేవీ పీఅండ్‌టీ కాలనీలో మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 3.30 గంటల వరకు మారుతీనగర్, పీఅండ్‌టీ కాలనీ, ప్రశాంత్‌నగర్, ఓంవిహార్ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

క్రికెట్‌లో విజేత జట్టుకు ట్రోఫీ ప్రదానం



ట్రోఫీలను అందజేస్తున్న నాచారం ఇన్‌స్పెక్టర్ రుద్వీర్‌కుమార్

మల్లాపూర్: క్రీడలు మానసిక, శారీరక ధృఢత్వానికి దోహదపడతాయని, నాచారం ఇన్‌స్పెక్టర్ రుద్వీర్ కుమార్ అన్నారు. నాచారం పారిశ్రామికవాడలో వాయిత్ టర్బో, ఎల్‌మెట్ కంపెనీల సంయుక్తాధ్వర్యంలో క్రికెట్ లీగ్ మ్యాచ్‌లను నిర్వహించారు. దాదాపు 6 కంపెనీలకు చెందిన కార్మికులు పాల్గొన్నాయి. ఫైనల్ మ్యాచ్‌లో ఐ కామ్ కంపెనీ విన్నర్‌గా, క్లియర్ సెత్ రన్నర్‌గా నిలిచింది. విజేత జట్టుకి నాచారం ఇన్‌స్పెక్టర్ రుద్వీర్‌కుమార్ ట్రోఫీలను అందజేశారు. నాచారం ఐలా ప్రధాన కార్యదర్శి బాలరాజ్, వాయిత్ టర్బో ప్రతినిధులు మహేష్, నర్సింగ్‌రావు, ఎలోమెట్ ప్రతినిధి సాయిగౌడ్, శ్రీపతి, ఉమామహేశ్వర్, సుధాకర్, చందు, పవన్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో పలు ఫిర్యాదులు

మల్కాజిగిరి: మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో ఫిర్యాదులు అందాయని డీసీ రాజు తెలిపారు. ఇంజినీరింగ్ విభాగంలో 1, టౌన్ ప్లానింగ్ విభాగంలో 2 ఫిర్యాదులను అధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటారన్నారు. మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ సఫిల్‌గూడ నుంచి నేరేడ్‌మెట్ వరకు రోడ్డు డివైడర్లు ఏర్పాటు చేయాలని, ఓల్డ్ నేరేడ్‌మెట్‌లోని అంబేద్కర్ భవనంపై రెండో అంతస్తు నిర్మాణం చేపట్టాలన్నారు. మూడు గుళ్ల వద్ద నిలిచిపోయిన 600 ఎంఎం డయా వరదనీటి పైపులైన్ నేరేడ్‌మెట్ వరకు ఏర్పాటు చేయాలని కోరారు.



వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ శ్రవణ్

పుష్ప–2 దర్శకుడు,హీరో, నిర్మాతలపై చర్యలు తీసుకోవాలి



ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్సీ మల్లన్న

మేడిపల్లి: పోలీసులను కించపరిచేలా పుష్ప–2 చలన చిత్రంలో కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారని అందుకు బాధ్యులైన సినిమా దర్శకుడు, హీరో, నిర్మాతలపై కేసు నమోదు చేయాలని కోరుతూ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సోమవారం మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అల్లు అర్జున్ హీరోగా నటించిన పుష్ప–2 చిత్రంలో పోలీసులను అవమానించేలా కొన్ని దృశ్యాలను చిత్రీకరించడం దారుణమని ఇందుకు బాధ్యులపై చట్టపరమైన చర్యలను తీసుకోవాలని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ గోవింద రెడ్డి తెలిపారు.

విద్యాజ్యోతిలో 'ప్రజ్ఞ మ్యాథ్స్ ఫెయిర్'



నమూనాను తిలకిస్తున్న యాదగిరి

బోడుప్పల్: చెంగిచర్లలోని విద్యాజ్యోతి ఉన్నత పాఠశాలలో శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా సోమవారం నిర్వహించిన 'ప్రజ్ఞ మ్యాథ్స్ ఫెయిర్' ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు యాదగిరి హాజరై ప్రారంభించారు. విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను ఆయన తిలకించారు. వేదగణితానికి సంబంధించిన పలు నమూనాలు, పజిల్స్ ప్రత్యేక ఆకర్షణీయంగా నిలిచాయి. పాఠశాల డైరెక్టర్లు శ్రవణ్‌కుమార్‌రెడ్డి, అనిల్ అయ్యంగార్, ప్రిన్సిపాల్ నీలిమా విద్యార్థులు పాల్గొన్నారు.

అమ్మవారి కల్యాణమహోత్సవం



ప్రత్యేక పూజల్లో కార్పొరేటర్ రాజ్యలక్ష్మి

అల్వాల్: నేరేడ్‌మెట్ ఈస్ట్ కాకతీయనగర్‌లోని శ్రీ విజయగణపతి, రేణుకాఎల్లమ్మ ఆలయంలో మూడ్రోజుల పాటు ఘనంగా ఉత్సవాలు నిర్వహించారు. చివరి రోజున అమ్మవారి కల్యాణం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ రాజ్యలక్ష్మి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, అడ్వకేట్ పూల శ్రీనివాసన్, కమిటీ మెంబర్లు శివ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

భాష్యం స్కూల్ వార్షికోత్సవ వేడుకల్లో నృత్య ప్రదర్శన



ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి బుద్ధానగర్ రోడ్డు నెంబర్–3లో భాష్యం ఉన్నత పాఠశాలలో 14వ వార్షికోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పీర్జాదిగూడ నగర మేయర్ అమర్‌సింగ్, భాష్యం పాఠశాల జోనల్ అంకమ రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వర్ణకుమారి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మేయర్ మాట్లాడుతూ.. విద్యార్థులు తమ జీవిత లక్ష్యాన్ని ఏర్పరుచుకుని తదనుగుణంగా సాధన చేసి విజయం సాధించాలని ఆకాంక్షించారు. వివిధ ఆటల పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ప్రభుత్వ స్థలం కబ్జాపై అధికారుల స్పందన

అక్రమ నిర్మాణాల కూల్చివేత

సాక్షి ఎఫెక్ట్..

బోడుప్పల్: ప్రభుత్వ స్థలం కబ్జాపై అధికారులు స్పందించారు. సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన' ప్రభుత్వ స్థలం కబ్జా' కథనానికి స్పందించిన మున్సిపల్, మండల రెవెన్యూ అధికారులు నిర్మించిన అక్రమ నిర్మాణాలను జేసీబీతో సాయంతో తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ రామలింగం మాట్లాడుతూ.. 13వ డివిజన్‌లోని ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మించిన ఇళ్లు, 14వ డివిజన్‌లో అనుమతులు లేకుండా చేపట్టిన షెడ్డును కూల్చివేసినట్లు వివరించారు. 2019 మున్సిపల్ యాక్ట్‌ను అనుసరించి ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా అక్రమ నిర్మాణాలు కూల్చివేస్తామని స్పష్టం చేశారు. నిర్మాణదారులు ఇంటి అనుమతులు తీసుకుని నిర్మాణాలు చేపట్టడంతో పాటు నగరాభివృద్ధికి సహకరించాలని కోరారు. తహసీల్దార్ హసీనా, ఆర్ఐ రాకేష్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



అక్రమ నిర్మాణాలను కూల్చివేయిస్తున్న అధికారులు

అభివృద్ధి పనుల పరిశీలన

మౌలాలి: వినాయక్‌నగర్ డివిజన్ పరిధిలోని అభివృద్ధి పనులను వినాయక్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ రాజ్యలక్ష్మి పరిశీలించారు. సోమవారం జీకే కాలనీలో అధికారులతో కలిసి బాక్స్‌డ్రైన్ పనులను పరిశీలించిన ఆమె త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. వెస్ట్ దీన్‌దయాల్‌నగర్‌కు సరఫరా చేసే నీటి షట్టర్ (వాల్వ్) పనిచేయకపోవడం వల్ల నీటి సమస్య నెలకొందని, జలమండలి మేనేజర్ కృష్ణప్రసాద్‌తో కలిసి మరమ్మతులు చేయించి నీటి సరఫరాను పునరుద్ధరిస్తామన్నారు. డివిజన్ బీజేపీ నేతలు సాయి, సురేష్, శ్రీకాంత్, గోపాల్, జగదీష్‌చారి,శివ, స్థానికులు నవీన్, లత, దీపక్ తదితరులున్నారు.



తాగునీటి గేట్‌వాల్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రాజ్యలక్ష్మి

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

అల్వాల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందిన ఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కానాజిగూడకు చెందిన చిన్న మహేష్ (29) సెంట్రింగ్ పనిచేస్తుంటాడు. ఈనెల 21న రాత్రి స్నేహితుడి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొనేందుకు మరో స్నేహితుడు నాగరాజుతో కలిసి ద్విచక్ర వాహనంపై వెంకటాపురం వెళ్లి తిరిగి వస్తుండగా.. శివనగర్ వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. మహేష్‌కు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వినతిపత్రం అందజేస్తున్న రచ్చ కిషన్

ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించండి

బోడుప్పల్: మేడిపల్లి మండల పరిధిలో అన్యాక్రాంతం అవుతున్న ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలని సీపీఐ మండల కార్యదర్శి రచ్చ కిషన్ సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సర్వేనంబరు 63/1లో, 63/26, 38 వరకు గల ప్రభుత్వ స్థలాల్లో యధేచ్ఛగా నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. జంట నగరాల మున్సిపాలిటీల్లో అక్రమ నిర్మాణాలు, సెల్లార్లు చేపడుతున్నారన్నారు.

◆ చెంగిచర్ల విద్యాజ్యోతి ఉన్నత పాఠశాలలో నిర్మిస్తున్న అక్రమ షెట్టర్లను కూల్చివేయాలని వినతిపత్రంలో కోరారు. ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి దండు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మెడికల్ కాలేజీ వార్షికోత్సవానికి ఆహ్వానం



స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు ఆహ్వానం అందజేస్తున్న దృశ్యం



మంత్రి దామోదర రాజనర్సింహకు పుష్పగుచ్ఛం అందజేస్తూ

రామంతాపూర్ : ఈనెల 30న నిర్వహించే రామంతాపూర్ ప్రభుత్వ హోమియో మెడికల్ కళాశాల 57వ వార్షికోత్సవానికి హాజరుకావాలని సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ ఆయుష్ అదనపు డైరెక్టర్ డాక్టర్. లింగరాజు రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు ఆహ్వానపత్రాన్ని అందజేశారు.

మొదలైన క్రిస్మస్ సందడి

• విద్యుత్ దీపాలతో ముస్తాబైన చర్చిలు
• పలుచోట్ల సెమీ క్రిస్మస్ వేడుకలు


ఉప్పల్, మల్కాజ్‌గిరి జోన్ల పరిధిలో రామంతాపూర్, బోడుప్పల్, మల్లాపూర్, మౌలాలి తదితర ప్రాంతాల్లో క్రిస్మస్ వేడుకల సందడి మొదలైంది. సోమవారం పలు చర్చ్‌లు విద్యుత్ కాంతులతో ఆకట్టుకున్నాయి.



క్రిస్మస్ వేడుకల్లో కార్పొరేటర్ జంగయ్యయాదవ్




క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ రాజ్యలక్ష్మి



విద్యుత్ దీపాల అలంకరణతో ముస్తాబైన చర్చి



క్రీస్తు జననం నాటిక ప్రదర్శన



హోలీ స్పిరిట్ చర్చి